అన్ని వర్గాల ప్రజలకు అండగా ప్రభుత్వం

- ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి
- కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ


పోరంకిలో లబ్ధిదారులకు కొత్త పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు అండగా ప్రభుత్వం ఉందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. తాడిగడప మున్సిపాలిటీ, పెనమలూరు మండలంలో కలిపి కొత్తగా మంజూరైన 286 పింఛన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం పోరంకి ఎల్ఎస్ గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి మాట్లాడుతూ ప్రభుత్వం అవ్వాతాతలతో పాటు వివిధ రకాల పింఛన్లు అందజేస్తుందన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు పేదలకు అమలు చేస్తుంటే పన్నులు కట్టిన వారి సొమ్ము ప్రభుత్వం పంచేస్తుందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఖండించారు. నేడు పింఛన్లు పొందుతున్న వృద్ధులు సమాజానికి ఎంతో సేవ చేసిన వారేనని తెలిపారు. వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం, సమాజంపై ఉందన్నారు. జగనన్న చెప్పిన విధంగానే పింఛన్లు అర్హులైన వారికి మంజూరు చేసి దశలవారీగా పింఛన్ సొమ్ము రూ.3 వేలకు పెంచామన్నారు. నియోజకవర్గంలో దాదాపు 30 వేల పింఛన్లు ప్రతినెలా ప్రభుత్వం అందజేస్తుందన్నారు. తాడిగడప మున్సిపాలిటీలో 12,997 మందికి, పెనమలూరు మండలంలో 5849 మందికి వలంటీర్లు ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేస్తున్నారన్నారు. కమిషనర్ ఎన్.ప్రకాశరావు, ఎంపీడీ ఓసునీతాశర్మ, తహసీల్దార్ కట్టా వెంకట శివయ్య, కార్పొరేషన్ డైరెక్టర్లు పి.రాఘవరావు, ఈడే చాముండేశ్వరి, ఏఎంసీ చైర్‌పర్సన్ నీనావత్ చిన్ని, సర్పంచిలు కాకర్ల వెంకటరత్నం, గుంటూరు శ్రీనివాసచౌదరి, లింగాల భాస్కరరావు,అక్బర్‌పాషా, సంగెపు శ్రీనివాసరావు, చెక్క విజయ, నేతలు అన్నే వేణుగోపాల కృష్ణమూర్తి,చాంద్‌బాషా, అన్నే శ్రావణ్‌కుమార్, ఆదిశేషారావు, వల్లే నరసింహారావు, గద్దల రాజా, మండూరు కోటేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

వృద్ధుల ఆత్మగౌరవం పెంచిన సీఎం వైఎస్ జగన్

హనుమాన్‌జంక్షన్ రూరల్: వృద్ధుల ఆత్మగౌరవాన్ని పెంచేలా ప్రతి నెలా ఇంటి వద్దే పింఛన్ అందించేలా చర్యలు తీసుకున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేనని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ అన్నారు. బాపులపాడులో కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. ప్రజాప్రతినిధుల చేతుల మీదగా లబ్ధిదారులకు పింఛను మంజూరు పత్రాలను అందించారు. రూ.3 వేలు పింఛను అందుకున్న అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు ఆనందోత్సాహలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ సరిపల్లి కమలాభాయి అధ్యక్షతన జరిగిన సభ నిర్వహించారు. ఆవిర్నేని శేషగిరిరావు, కిరణ్ మూర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగా భవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, ఉప సర్పంచ్ దుట్టా శివన్నారాయణ, సచివాలయ కన్వీనర్ యర్రగొర్ల వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

నూరు శాతం హామీలను నెరవేర్చిన ప్రభుత్వం

రామవరప్పాడు: గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు 100 శాతం అమలు చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని జెడ్పీటీసీ సభ్యుడు సువర్ణరాజు అన్నారు. విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు సచివాలయం-3లో పెంచిన వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమాన్ని మండల స్థాయిలో బుధవారం పండుగలా నిర్వహించారు. ఈ సందర్భంగా సువర్ణరాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ నెరవేరుస్తూ దేశంలోనే అత్యధికంగా రూ.3 వేలకు పెంచి సీఎం జగన్ మాట నిలబెట్టుకున్నారన్నారు.

ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నెలా రూ.2 వేల కోట్ల ఖర్చుతో 66.34 లక్షల మందికి గడప వద్దకే పింఛన్లు అందిస్తూ అవ్వ, తాతల ముఖాల్లో చిరునవ్వును నింపారన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు శీలం రంగారావు, ఎంపీడీఓ భార్గవి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్.వెంకటేశ్వరరావు, రైతు సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, రామవరప్పాడు సర్పంచ్ వరి శ్రీదేవి, పలు గ్రామాల ఎంపీటీసీ, వార్డు సభ్యులు, పలు గ్రామాల కార్యదర్శులు, సచివాలయల సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.


తేలప్రోలులో పింఛన్ అందజేస్తున్న వింత శంకర్‌రెడ్డి, సర్పంచ్


బాపులపాడులో కొత్త పింఛన్ల మంజూరు పత్రాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

దేశంలోనే ఏపీ ఆదర్శం

ఉంగుటూరు: సంక్షేమ పథకాలను అమలు చేయడంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలిచిందని ఎంపీపీ వడ్లమూడి సరోజిని అన్నారు. మండలంలో తేలప్రోలు, మానికొండ, ఇందుపల్లి గ్రామాల్లో పెంచిన పింఛన్లు పంపిణీ కార్యక్రమం బుధవారం పండుగ వాతావరణంలో జరిగింది. ఈ సందర్భంగా మట్లాడుతూ ఇచ్చిన హామీలను నిలబెట్టుకుని క్రమానుగుణంగా రూ.3 వేల వరకు పెంచుకుంటూ పింఛను అందజేస్తున్నారని చెప్పారు. అనంతరం పింఛన్ లబ్ధిదారులు సీఎం జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆయా గ్రామాల సర్పంచులు లాం దిబోర, నిమ్మకూరి స్వర్ణలత, బండి వెంకటలక్ష్మి, వైస్‌ఎంపీపీ వీరంకి కుసుమ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వింత శంకర్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ ఆదినారాయణరెడ్డి, ఎంపీడీవో శేషగిరిరావు, ఈవోపీఆర్డీ అమీర్‌బాష, తదితరులు పాల్గొన్నారు.


ఇందుపల్లిలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పింఛన్‌దారులు

పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రించాలి

కంకిపాడు: పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ చిన్నా డిమాండ్ చేశారు. ఈడుపుగల్లులోని ఆయన కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. చిన్నా మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు తగ్గినా కేంద్రం పెట్రోలు, డీజిలు ధరలను తగ్గించకుండా ప్రజల్ని దోచుకుంటుందని విమర్శించారు. పెట్రోలు, డీజిల్ ధరలు నిత్యావసర ధరలపై ప్రభావం చూపుతున్నాయన్నారు. నిత్యావసర ధరలకు కళ్లెం పడాలంటే పెట్రోలు, డీజిలు ధరలు నియంత్రించాలని డిమాండ్ చేశారు.

లబ్ధిదారులను మోసం చేసిన ముగ్గురిపై కేసు

పెనమలూరు: వణుకూరులో ఇళ్ల నిర్మాణం చేస్తానని నమ్మించి లబ్ధిదారులను మోసం చేసిన కాంట్రాక్టర్, ఇద్దరు సచివాలయ సిబ్బందిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీ వీ.రామారావు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేసింది. వారు ఇళ్ల నిర్మాణం చేసుకోవటానికి నిధులు కేటాయించింది. అయితే వణుకూరు సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లుగా పని చేస్తున్న నవీనా, సురేష్‌వర్మ పెదపులిపాక గ్రామానికి చెందిన ఇళ్ల కాంట్రాక్టర్ పనులు చేసే కె.వీరకృష్ణను ఇళ్లు నిర్మాణం చేసి పెడతాడని లబ్ధిదారులకు పరిచయం చేశారు. వారి మాటలు నమ్మిన లబ్ధిదారులు దాదాపు 16 మంది రూ.15 లక్షల మేర సొమ్ము వీరకృష్ణకు ఇళ్ల నిర్మాణానికి అడ్వాన్స్‌గా ఇచ్చాడు. అయితే వీరకృష్ణ ఇళ్ల నిర్మాణం చేపట్టకుండా కనిపించకుండా పోయాడు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

నేటి నుంచి ఉపాధి పనుల తనిఖీ



పెనమలూరు: మండల పరిధిలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై గురువారం నుంచి తనిఖీ నిర్వహించనున్నారు. మండల పరిధిలో 2022-2023 ఆర్థిక సంవత్సరంలో రూ.85 లక్షల విలువ చేసే 550 పనులు చేశారు. ఈ పనులను తనిఖీ చేయటానికి ప్రత్యేక టీం వచ్చింది. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. చేసిన ఉపాధి పనులతోపాటు జగనన్న కాలనీలో జరిగిన ఉపాధి పనులను పరిశీలించేందుకు సిబ్బంది సహకరించాలన్నారు. ఈ నెల 11వ తేదీన సామాజిక తనిఖీ ఉన్న నేపథ్యంలో అన్ని రికార్డులు సిద్ధం చేసుకోవాలని ఎంపీడీఓ సునీతాశర్మ తెలిపారు. ఈ సమావేశంలో ఏపీవో లోయ శివశంకర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి కృషి చేయాలి

కంకిపాడు: ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి కేంద్రం చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఇంటూరి ఏలియా డిమాండ్ చేశారు. కంకిపాడులోని సంఘ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఏలియా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ అన్ని కులాల్లో దారిద్ర్య రేఖకు దిగువన 45 సంవత్సరాలు పైబడ్డ ప్రతి మహిళకు రూ.5 వేలు పింఛను అందించాలని డిమాండ్ చేశారు. ప్రతి పేద కుటుంబానికి రెండెకరాల భూమి ఇవ్వాలని కోరారు. దివ్యాంగులకు రూ.10 వేలు పింఛను అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. డప్పు కళాకారులు, వృత్తిదారుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, బ్యాంకుల నుంచి పూచీకత్తు లేని రుణాలను అందించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు పరిశ్రమల్లో రిజర్వేషన్లను కల్పించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సమస్యలను ప్రస్తావిస్తూ ప్రధాని మోడీకి లేఖ పంపుతున్నామని వివరించారు.

అక్షింతల ఊరేగింపు



ఉయ్యూరు: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో అయోధ్య రామ స్వర్ణ అక్షింతల పంపిణీ కార్యక్రమం ఉయ్యూరులో బుధవారం నిర్వహించారు. రామసేవక్ సంఘ్ కన్వీనర్, ఆర్ఎస్ఎస్ ప్రతినిధి డాక్టర్ దివి చిన్మయ ఆధ్వర్యంలో భక్తులు పురవీధుల్లో ఊరేగుతూ రామనామస్మరణ చేసి అక్షింతలను వితరణ చేశారు. కార్యక్రమంలో భక్త బృందం చిందా వెంకటేశ్వర్లు రాజు, గబ్బిట వెంకటరమణ, చేవూరి రవిసుధాకర్, బొల్లా ప్రసాద్, సాకి రాజేష్, తెల్లాకుల శివనాగరాజు, కాగిత తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ వజ్రోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



కంకిపాడు: ఉపాధ్యాయులకు అండగా నిలుస్తామని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం 75 సంవత్సరాల వజ్రోత్సవం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఎస్టీయూ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండరు, డైరీని వజ్రోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలూ చేపడుతుందన్నారు. మరో కార్యక్రమంలో ఎంపీడీఓ పి.అనూష చేతులమీదుగా ఆవిష్కరణ జరిపించారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మండవ శ్రీనివాస్, పీకా ఇమ్మానుయేలు, రాష్ట్ర కౌన్సిలర్ అళహరి శ్రీనివాసమూర్తి, కంకిపాడు, పమిడిముక్కల మండల నాయకులు పచ్చిగొళ్ల సురేష్‌బాబు, వై.శ్రీనివాసరావు, ఎం.ఏసుదాస్ పాల్గొన్నారు.

వక్ఫ్ భూముల తనిఖీ

పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో ఉన్న కొండపల్లి ఖాజీ సర్వీస్ భూములను వక్ఫ్‌బోర్డు అధికారులు బుధవారం తనిఖీ చేశారు. వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఎండి.నుహుఅలీషా వివరాలు తెలుపుతూ కొండపల్లి ఖాజీకి పెదపులిపాక గ్రామంలో ఆర్ఎస్ నంబర్ 87లో 12.59 ఎకరాల సాగు భూమి ఉందన్నారు. అయితే కౌలు తీసుకున్న వ్యక్తులు సాగుభూమికి పన్నులు చెల్లించటంలేదన్నారు. దీంతో తాము ఖాజీకి నోటీసులు ఇచ్చామని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌలు దారులు పన్నులు చెల్లించడంలేదని ఖాజీ ఫిర్యాదు చేయటంతో రికార్డులు పరిశీలించామన్నారు. ఖాజీ సర్వీసు భూములు కౌలు చేయటానికి బహిరంగ వేలం నిర్వహిస్తామని వారుపేర్కొన్నారు. ఈ మేరకు తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చామని వివరించారు. వక్ఫ్‌బోర్డు అధికారులు ఈవో అబ్దుల్‌కుద్దూస్, ఖాజీ ఎస్‌డి.అబీబుల్లా హుస్సేనీ తదితరులు పాల్గొన్నారు.

పుట్టింటికి చేరుకున్న పేరంటాలమ్మ


పేరంటాలమ్మను పుట్టింటికి తీసుకెళ్తున్న భక్తులు

రామవరప్పాడు: సంక్రాంతి ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం సాయంత్రం రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ మేళ తాళాల నడుమ పుట్టింటికి చేరుకున్నారు. రాజులబజార్‌లోని అమ్మవారి పుట్టింటికి వంశస్తులు, పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించిన పల్లకిలో పేరంటాలమ్మను ఉంచి భక్తిశ్రద్ధలతో పుట్టింటికి తీసుకెళ్లారు. సంక్రాంతి సంబరాలకు ఒక రోజు ముందు వరకు అమ్మవార్లు పుట్టింటిలోనే పూజలు అందుకుంటుంది. జనవరి 12న సాయంత్రం అమ్మవారి పుట్టింటి వారసులైన కళ్లేపల్లి ప్రభాకర్ వర్మ, నరసరాజు, భూపాల్ రాజు సోదరులచే పసుపు, కుంకుమ, నూతన వస్త్రముల బహూకరణతో పాటు యాదవ వంశస్తులైన వేమినేని వారిచే పోతు సమర్పణ అనంతరం అమ్మవార్లు ఊరేగింపుగా పుట్టింటి నుంచి ఆలయ ప్రవేశం చేస్తారు. జనవరి 13 నుంచి 18 వరకు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ భోయిన భాను ప్రదీప్, కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి, సీఐ కాశీ విశ్వనాథ్, పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికి తీసేందుకే 'ఆడుదాం ఆంధ్రా'

డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ


గంగూరులో క్రికెట్ ఆడుతున్న డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ

పెనమలూరు: క్రీడాకారుల ప్రతిభను వెలికి తీయటానికి ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు నిర్వహిస్తోందని డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ అన్నారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్‌కాలేజీలో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో భాగంగా బుధవారం జరిగిన క్రికెట్ పోటీల్లో ఆమె క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిభ కలిగిన క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావటానికి ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తుందన్నారు. ప్రతీ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రీడాకారులు రాణించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. క్రికెట్ పోటీ సందర్భంగా కెప్టెన్లు ప్రసన్నకుమార్, ఎండి.అహ్మద్‌భాషా టీంలకు టాస్ వేసి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు అక్బర్‌పాషా, రహీంభాషా, అజీజుల్లాఖాన్, అన్సర్‌భాషా, కె.పిచ్చయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బంగారు పతకాలు సాధించిన విద్యార్థినులు

- గన్నవరం జెడ్పీ హైస్కూల్ బాలికల ప్రతిభ
- 10 నుంచి ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


పతకాలు సాధించిన విద్యార్థినులు

గన్నవరం: పలు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు బంగారు పతకాలు సాధించినట్లు ప్రధానోపాధ్యాయురాలు డీ ఝాన్సీరాణి తెలిపారు. ఈ మేరకు బుధవారం పాఠశాలలో పతకాలు సాధించిన విద్యార్థినులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. గుంటూరు జిల్లా తెనాలిలో డిసెంబర్ 23 నుంచి 25 వరకు జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో తమ విద్యార్థినులు ఎస్కే భార్గవీ, వీ కైరున్నీసా మొదటి స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్స్ అందుకున్నట్లు చెప్పారు. అన్నమయ్య జిల్లా రైల్వేకొడూరులో జరిగిన రాష్ట్ర స్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో మానికొండ సాయిసత్య చిన్మాయ్, దొంతు మాద్విత బంగారు పతకాలు సాధించారని తెలిపారు. ఇరువురు విద్యార్థినులు ఈ నెల 10 నుంచి ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు చెప్పారు.

ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

ఉయ్యూరు: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు మెరుగైన ఆరోగ్యం అందుతుందని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) అన్నారు. ఉయ్యూరు పట్టణంలోని 1వ వార్డులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం బుధవారం నిర్వహించారు. శిబిరాన్ని చైర్మన్ వల్లభనేని నాని ప్రారంభించి వైద్య సేవలు పరిశీలించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నారన్నారు.

డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పరిశీలన..

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ పరిశీలించారు. వైద్య సేవలపై సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కంటి పరీక్షల తీరును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్నిగ్ధ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం గ్రామాలకు వైద్య సేవలను చేరువ చేశారన్నారు. కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు గుంజా సుధాకర్‌బాబు, కూరాడ వెంకటలక్ష్మి, డీవైఈఓ పద్మారాణి, వైద్యులు శ్వేత, కొంతి శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కోవిడ్ మార్గదర్శకాలు పాటించండి

మధురానగర్(విజయవాడసెంట్రల్): గర్భిణులు, బాలింతలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, కోవిడ్ మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటించాలని ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ జమీల్ సూచించారు. గులామెహిద్దీన్‌నగర్ ఆరోగ్యకేంద్రంలో బుధవారం గర్భిణులు, బాలింతలకు వ్యాక్సినేషన్ కార్యక్రమం జరిగింది. కోవిడ్ వ్యాపించకుండా మాస్కు ధరించడంతో పాటు సోషల్ డిస్టెన్స్ పాటించాలని సూచించారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవటంతో పాటు వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. అనంతరం చిన్నారులు, గర్భిణులకు వ్యాక్సిన్ వేశారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

హనుమాన్‌జంక్షన్ రూరల్: చట్ట విరుద్ధంగా సారా విక్రయించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ ఏడీఎల్ జనార్ధన్ హెచ్చరించారు. బాపులపాడు మండలం కొత్తపల్లిలో సారా తయారు చేసి విక్రయిస్తున్న బెజవాడ రమాకుమారి అనే మహిళను మంగళవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎస్ఐ ఏడీఎల్ జనార్ధన్ గ్రామంలో తనిఖీ నిర్వహించగా రమాకుమారి నుంచి 25 కిలోల సారాను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి బుధవారం నూజివీడు కోర్టులో హాజరుపర్చారు.

సైక్లిస్టును ఢీకొట్టిన లారీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్ ప్రధాన కూడలిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక ఇందిరానగర్‌కు చెందిన కుంచనపల్లి వెంకట సత్యనారాయణ (70) సైకిల్‌పై రోడ్డు దాటుతుండగా గ్యాస్ సిలిండర్ల లోడుతో ఏలూరు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. సైకిల్‌పై వెళ్తున్న సత్యనారాయణ ఎడమకాలుపైకి లారీ ముందు టైరు ఎక్కటంతో కాలు నుజ్జునుజ్జు అయింది. తీవ్ర రక్తస్రావంతో పడి ఉన్న వృద్ధుడిని స్థానికులు లారీ కింద నుంచి పక్కకు తీశారు. సమాచారం అందుకున్న ఎస్ఐ ఏడీఎల్ జనార్ధన్ సంఘటనా స్థలికి చేరకుని క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు పింఛన్ల పంపిణీ

కంకిపాడు: మండల స్థాయిలో వైఎస్సార్ పింఛను కానుక పంపిణీ కార్యక్రమం ఈనెల 4వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.అనూష తెలిపారు. బుధవారం ఆమె వివరాలు తెలుపుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో 9,333 పింఛన్లు ఉన్నాయన్నారు. వీరికి ప్రతి నెలా రూ.2,76,45,500 అందుతుందన్నారు. కొత్తగా ఈ నెలలో వికలాంగ, వృద్ధాప్య, ఒంటరి మహిళ, వితంతు పింఛన్లు 170 మంజూరయ్యాయన్నారు. వీరికి రూ.5,10,000 చెల్లిస్తామన్నారు. పింఛను కానుక పంపిణీ కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి హాజరవుతారని, ప్రజాప్రతినిధులు, అధికారులు విజయవంతం చేయాలని కోరారు.

గురుకుల నిర్మాణానికి భూమి పూజ

ఉంగుటూరు: స్థానిక విజ్ఞాన విహార పాఠశాల ప్రాంగణంలో శ్రీనివేదిత గురుకుల నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. విజ్ఞాన విహార అధ్యక్షుడు బి.వి.ఎస్.టీసాయి, కార్యదర్శి ముళ్లపూడి గోవిందరావు, పత్తి కుమార్ల దంపతులు భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నివేదిత గురుకులం ఒక విశిష్టమైన గురుకులమని, ఇందులో బాలికలకు విద్యతోపాటు భారతీయ కళలను బోధిస్తారని చెప్పారు. అనంతరం మాజీ మంత్రి కామినేని శ్రీనివాసరావు శ్రీనివేదిత గురుకులం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర ప్రచారక్ రామ్ భరత్, ప్రాంత ప్రచారక్ విజయాధిత్య, కిసాన్‌మోర్చ అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, పిన్నమనేని హాస్పిటల్స్ డైరెక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, సుధాకర్ చౌదరి పాల్గొన్నారు.

బందరు రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణల తొలగింపు


పోరంకిలో అక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

పెనమలూరు: విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి బందరు రోడ్డు ఆక్రమణలను ఎన్‌హెచ్ఐ అధికారులు వేగంగా తొలగిస్తున్నారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో ఉన్న బందరు రోడ్డుకు డ్రైనేజీ పనులు ఎన్‌హెచ్ఐ చేపట్టింది. అయితే ఎన్‌హెచ్ఐ పరిధిలో ఉన్న రోడ్డును దుకాణాల యజమానులు, వ్యాపారులు ఆక్రమించారు. గత కొద్ది రోజుల క్రితం ఆక్రమణలు తొలగించాలని అధికారులు మార్కెటింగ్ వేసినా ఎవ్వరు స్పందించలేదు. దీంతో ఎన్‌హెచ్ఐ అధికారుల ఆదేశాలతో రోడ్డు మార్జిన్ ఆక్రమణలకు జేసీబీతో తొలగిస్తున్నారు. చాలా దుకాణాలు రోడ్డును ఆక్రమించనట్లు గుర్తించారు. డ్రైయిన్ల నిర్మాణం చేయాలంటే ఆక్రమణల తొలగింపు అనివార్యంగా మారింది. దీంతో అడ్డుగా ఉన్న కట్టడాలను తొలగిస్తున్నారు. డ్రైయినేజీ నిర్మాణానికి అడ్డుగా ఉన్న అన్ని ఆక్రమణలు తొలగిస్తామని అధికారులు తెలిపారు.

బాలికా విద్యకు సావిత్రీబాయి పూలే కృషి


సావిత్రీబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ, మహిళలు

గన్నవరం: స్థానిక రాయ్‌నగర్‌లో బుధవారం జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రీబాయి పూలే చిత్రపటానికి జెడ్పీటీసీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యమవుతుందని నమ్మిన సావిత్రీబాయి దేశంలో బాలికలకు తొలిసారిగా పాఠశాలను స్థాపించారని చెప్పారు. స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన ఆమె తొలితరం మహిళా ఉద్యమకారిణిగా చరిత్రలో నిలిచారని తెలిపారు. మహిళా సంఘానికి చెందిన ఈదా సుజాత, పద్మ, కూనపురెడ్డి రజనీ, మేరి పాల్గొన్నారు.